## క్లుప్తంగా

### ఆశ్రయించిన వారిని ఆదుకునే ‘తిమ్మప్ప స్వామి’


తిమప్ప మూల విరాట్

మద్దికెర: ఆశ్రయించిన వారిని ఆదుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే తిమ్మప్ప స్వామి, యడివళ్లప్ప స్వామి, దడేభూలప్ప స్వామి వార్ల జాతర ఉత్సవాలను అ నెల 28 నుంచి ఘనంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే గ్రామంలో రథోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో కొలువైన తిమ్మప్పస్వామి వార్ల జాతర ఉత్సవాలు 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. 28న ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, గణపతి పూజ, గంగపూజ, సాయంత్రం 6 గంటలకు ఉత్సవంతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు తెలిపారు. 29న సాయంత్రం రథం ముందు హోమం, అశేష జనవాహిని మధ్య స్వామి వారి రథోత్సవం, రాత్రి పంచమాంకములు పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. మార్చి 1న పారువేటతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

### పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు


ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను సరిచూసుకుంటున్న అధికారులు

కృష్ణగిరి: మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని రూట్ అధికారి శంకర్ రెడ్డి పోలీస్ బందోబస్తుతో తీసుకొచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో జరిగే సెంటర్‌కు సంబంధించి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర ప్రశ్నాపత్రాలు వచ్చాయని ఆయన తెలిపారు. వీటిని సెంటర్ డిపార్ట్‌మెంటల్, చీఫ్ అధికారులైన రాజనాయక్, నిర్మలా కుమారి సమక్షంలో అప్పగించినట్లు ఆయన చెప్పారు.

### టీడీపీకి షాక్

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కారం భాస్కర రెడ్డి వ్యక్తిగత, ఆరోగ్య సమస్యల కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను టీడీపీ అధ్యక్షుడికి పంపినట్లు వెల్లడించారు. సీనియర్ రాజకీయ నాయకుడైన భాస్కరరెడ్డి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరిన సమయంలో ఆయన వెంట వెళ్లారు. కోట్ల అనుచరుడిగా ఉన్న ఈయన కాంగ్రెస్ పార్టీలో డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

### దేవనబండలో బాలుడికి డెంగీ


దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారుల బృందం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామంలో 12 ఏళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. సోమవారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, పుచ్చకాయలమాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌కుమార్ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. డెంగీ సోకిన ఇంటితో పాటు చుట్టుపక్కల దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేశారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ రవికుమార్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సీఐ మోహన్ రెడ్డి

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నాగలదిన్నెలో వాహనాల తనిఖీ చేపట్టగా అక్రమ మద్యం పట్టుబడినట్లు తెలిపారు. సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామానికి బోయ ఉరుకుంద, అయిజ మండలం కేశవరం గ్రామానికి చెందిన చాకలి మద్దిలేటి బైక్‌పై కర్ణాటక ప్రాంతానికి చెందిన 480 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లతో పట్టుబడినట్లు చెప్పారు. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఆలూరు సీహెచ్‌సీలో నెలనెలా వైద్య పరీక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ
- తగ్గుతున్న రక్తహీనత సమస్య
- ఆలూరు, ఆస్పరి ఐసీడీఎస్ పరిధిలో 3,643 మంది గర్భిణులు


ఆలూరు సీహెచ్‌సీలో గర్భిణి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న గైనకాలజిస్ట్

ఆలూరు రూరల్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నెలనెలా ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. ఆరోగ్య సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందజేస్తోంది. సుఖప్రసవాలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు తగ్గుతున్నాయి. రక్తహీనత సమస్యల నుంచి బయటపడుతున్నారు.

**ఇదీ లెక్క..**

ఆలూరు, ఆస్పరి ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో జనవరి నెల చివరి నాటికి 3,643 మంది గర్భిణులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 9వ తేదీ ఆలూరు సీహెచ్‌సీతో పాటు ఆయా మండలాల్లోని పీహెచ్‌సీలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ మాత్రలు అందిస్తున్నారు. ప్రసవం తేదీ దగ్గరపడిన వారికి అవసరమైతే ఉచితంగా రక్తాన్ని ఎక్కిస్తున్నారు. దీంతో రక్తహీనత సమస్య ఉన్న వారిని 10 శాతానికి తగ్గించారు.

**హెచ్‌బీ పెరిగేలా..**

గర్భం దాల్చిన వెంటనే గర్భిణుల వివరాలను ఏఎన్‌ఎంలు ఆరోగ్య యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆ తర్వాత హెచ్‌బీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి, హెచ్‌బీ (హిమోగ్లోబిన్) తక్కువగా ఉన్నట్టు నిర్ధారణ అయితే చికిత్స అందిస్తారు. హెచ్‌బీ 6, 7 పాయింట్లు ఉన్నట్లయితే వారికి శుక్రోజ్ వ్యాక్సిన్లు పీహెచ్‌సీల్లో ఎక్కిస్తారు. హెచ్‌బీ 9 గ్రాములు ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తారు. ప్రసవ సమయానికి గర్భిణి ఇబ్బంది పడకుండా అవసరమైన రక్తం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**నెలనెలా పౌష్టికాహారం పంపిణీ..**

గర్భిణులకు రక్తం పెరిగేలా ప్రభుత్వం ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద రాగి పిండి, అటుకులు, పాలు, గుడ్లు, ఆయిల్‌తో కూడిన కిట్టును అందించి గర్భిణుల ఆరోగ్యానికి కృషిచేస్తోంది.

**రక్తహీనత తగ్గింది**

గర్భిణుల్లో రక్తహీనత సమస్య తగ్గింది. ప్రతి నెలా 9వ తేదీతో పాటు వారంలో మూడుసార్లు ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. సకాలంలో ఉచితంగా వైద్య పరీక్షలు అందించడంతో పాటు పౌష్టికాహారం సరఫరా అవుతుండడంతో గర్భిణులు ఆరోగ్యంగా ఉంటూ పిల్లలకు జన్మనిస్తున్నారు. గత రెండు నెలల్లో రక్తహీనత సమస్య బాగా తగ్గింది.

– గీతావాణి, గైనకాలజిస్ట్, ఆలూరు


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త బుసినె విరుపాక్షి

## వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గ పరిధిలోని ఆస్పరికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు సంబంధించిన 50 మైనారిటీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, చేసిన అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో దావుద్, ఇస్మాయిల్, వలి, షేక్షావలి, హుసేన్ బాషా, హుశేన్ బాష, సోను, రెహ్మాన్ అక్షర్‌షా, అలీబాషా, వన్నూర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## 28న రైతు భరోసా, సున్నా వడ్డీ విడుదల

తుగ్గలి: ‘వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్’ పథకంలో భాగంగా వరుసగా ఐదో ఏడాది పెట్టుబడి సాయాన్ని ఈ నెల 28న ప్రభుత్వం విడుదల చేయనుంది. రైతు భరోసా– పీఎం కిసాన్ పథకం కింద 16,435 మంది రైతులకు రూ.2 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో పాటు వైఎస్సార్ పంట రుణాల సున్నావడ్డీ కింద 2021–22 రబీలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న 534 మంది రైతులకు రూ.12.45 లక్షలు, 2022 ఖరీఫ్‌లో పంట రుణాలు పొందిన 6,861 మంది రైతులకు రూ.1.79 కోట్లు వడ్డీ జమ కానుంది. గతేడాది జూన్‌లో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేల ప్రకారం జమ చేయగా.. తాజాగా తుది విడతగా రూ.2 వేల ప్రకారం అందనుంది. మొత్తంగా ఏటా రూ.13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందుతోంది. ఇందులో కేంద్రం వాటా రూ.6 వేలు కాగా, మిగిలిన రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. కేంద్రంతో పని లేకుండా కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని వైఎస్సార్‌సీపీ సర్కార్ విడుదల చేస్తోంది. ఈనెల 28న పీఎం కిసాన్–రైతు భరోసా నిధులు, సున్నా వడ్డీ నిధులు రైతుల ఖాతాలకు జమ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు.

### మధ్యాహ్న భోజనం బహు బాగు

దేవనకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం ఎంతో బాగుందని విద్యార్థులు, హెచ్‌ఎం బజారప్ప తెలిపారు. సోమవారం దేవనకొండ జెడ్పీ హైస్కూల్‌లో దాదాపు 530 మందికి మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వెజిటబుల్ రైస్, టమాట కర్రీ, సాంబారు, గుడ్డు, కిచిడీ అందించారు. భోజనం పోషకాలతో పాటు రుచికరంగా ఉండడంతో విద్యార్థులు సంతోషంగా ఆరగించారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉండగా కేవలం 100 మంది మాత్రమే మధ్యాహ్న భోజనం చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం పాటిస్తున్న మెనూ వల్ల ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారని హెచ్‌ఎం తెలిపారు.

### పాఠశాల భవనం ప్రారంభోత్సవం

దేవనకొండ: జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) ఇన్సూరెన్స్ రంగంతో పాటు సేవారంగంలో తనవంతు సహకారం అందిస్తోందని ఎల్‌ఐసీ సౌత్ సెంట్రల్ రీజినల్ మేనేజర్ ఉతూఫ్ జోసెఫ్, కడప డివిజనల్ మేనేజర్ గిరిధర్ అన్నారు. సోమవారం మండలంలోని కరివేముల గ్రామంలో ఆర్డీటీ సంస్థ ఎల్‌ఐసీ వారి ఆర్థిక సహకారంతో కొత్తగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆర్డీటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కడప ప్రొడక్ట్ మేనేజర్ రామకృష్ణ, సుజిత్‌కుమార్, రామ్మోహన్ రెడ్డి, ఆర్డీటీ ప్రతినిధి సాగర్‌మూర్తి, విశాల తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ఆధ్యాత్మిక ప్రచారం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెద్దహుల్తి, పుచ్చకాయలమాడ గ్రామాల్లో సోమవారం మహాశివరాత్రి పర్వదినంపై త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో ప్రచార జాతా నిర్వహించారు. శివరాత్రి పండుగ ప్రశస్తిని వివరించారు. ప్రబోధ సమితి సభ్యులు రవికుమార్, దేవేంద్ర, శ్రీనివాస్, నాగరాజు, ఈరన్న, లలిత పాల్గొన్నారు.

**అవి-ఇవి**


### స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలి

హొళగుంద: మండల కేంద్రంలో సర్వే నంబర్లు 560 ఏ, బీ, సీ లోని 93 సెంట్ల భూమిలో స్థలాలు రిజిస్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం సర్వే డీటీ ముకుందరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు సుధా, ప్రకాష్, మహేంద్ర తదితరులు మాట్లాడుతూ.. సదరు సర్వే నంబర్లలో కొన్నేళ్లుగా చాలా మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో సదరు భూమి కాలువ, రోడ్డుగా నమోదైఉందని, దీనివల్ల రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆన్‌లైన్‌లో సవరణ చేసి స్థలాలు రిజిస్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### గర్భిణికి రక్తదానం

హొళగుంద: చిప్పగిరి మండలం నగరడోణ గ్రామానికి చెందిన వసంత అనే గర్భిణికి బి నెగటివ్ గ్రూపు రక్తం అత్యవసరం కాగా సోమవారం ఎల్లార్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌కే గిరి రక్తదానం చేశారు. సదరు గర్భిణీ రక్తహీనత సమస్యతో బాధపడుతోంది. ఆమె కోలుకునేందుకు అరుదైన బీ నెగటివ్ గ్రూపు రక్తం అవసరం కావడంతో బంధువులు గిరిని సంప్రదించారు. ఆయన గుంతకల్‌లోని గోపి బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తదానం చేశారు. గర్భిణి కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గిరి ఇప్పటివరకు 26 సార్లు రక్తదానం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తున్న కేంద్రం


ఎమ్మిగనూరులో బైక్ ర్యాలీ చేపట్టిన కార్మిక, రైతు సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ రైతులకు అన్యాయం చేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పలు కార్మిక, రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. బీజేపీ రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న రైతులపై కాల్పులు జరిపి ఐదుగురి ప్రాణాలను బలిగొనడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎస్ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఆయా సంఘాల నాయకులు తిమ్మగురుడు, వీరేష్, మాలిక్, శాంతప్ప, రామాంజినేయులు, గోవిందు, ప్రసాద్, ఏసేపు మాట్లాడారు. రైతులు పండించిన దిగుబడులకు కనీస మద్దతు ధర చట్టం తేవాలన్నారు. రైతుల మరణాలకు కారణమైన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు సంఘాల నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాచి వడబోసిన నీటినే తాగాలి

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఎస్ఎస్ ట్యాంక్ నుంచి పట్టణంలోని కొళాయిలకు సరఫరా చేసే నీటిని కాచి వడబోసి చల్లార్చిన తరువాతే తాగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం ప్రజలకు సూచించారు. మంచినీటిని వృథా చేయరాదని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు.

### స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

హాలహర్వి: స్పందన ద్వారా వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తహసీల్దార్ బ్యూల అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం చేపట్టారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎంపీడీఓ ఆంతోనీ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవనకొండ: స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మంచినీటి ట్యాంకుల ఏర్పాటు

ఆస్పరి: మండలంలోని మలుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి గ్రామస్తులు, భక్తుల కోసం ఉచితంగా మంచి నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. సోమవారం గంధం నుంచి జియారత్ కార్యక్రమం ముగిసే వరకు 3 ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సౌకర్యాల కల్పనపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణ

చిప్పగిరి: మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జాన్ మండలంలోని ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రోజు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆ రోజున వేయించుకోని వారికి రెండు, మూడవ రోజు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. మండలంలో వంద శాతం పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### పన్ను వసూలు చేయండి

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్లలో ఇంటి, కొళాయి, షాపుల పన్నులు చెల్లించాలని ఈఓ సతీష్ కోరారు. ఆయన సోమవారం గోనెగండ్లలోని ఆయా వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24కు సంబంధించిన ఇంటి, కొళాయి, షాపుల పన్నులు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు 50 శాతం పన్ను వసూలు అయ్యిందని వంద శాతం వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సమస్య లేకుండా చూసుకుంటామన్నారు. పంచాయతీ సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ తదితరులు ఉన్నారు.

### అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

పత్తికొండ రూరల్: తన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు రంగమ్మ సోమవారం ఆర్డీఓ నీలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని తన తండ్రి చిన్నరామన్నకు చెందిన స్థలంలో మునెప్ప అనే వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నారని, దీనిపై పంచాయతీ కార్యదర్శి మునిస్వామికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు.

### సమస్యాత్మక గ్రామాలపై నిఘా

కృష్ణగిరి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని టి.గోకులపాడు, తొగర్చేడు, ఎరుకలచెర్వు, కంబాలపాడు, చిట్యాల, కోయిలకొండ, ఆలంకొండ, చుంచుఎర్రగుడి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో నేరచరిత్ర కలిగిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. బి.ఎర్రబాడుకు చెందిన 8 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ అనురాధ ముందు హాజరుపరిచగా పూచీకత్తుపై విడుదల చేసినట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.

## డ్రిప్ ద్వారా తక్కువ నీటితో పైర్ల సాగు


అలారుదిన్నెలో పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిణి ఇందిర

ఆలూరు: డ్రిప్ విధానం ద్వారా రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు సాధ్యమవుతుందని ఆలూరు సబ్ డివిజన్ హార్టికల్చర్ అధికారిణి ఇందిర అన్నారు. ఆమె సోమవారం ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల్లోని వరిముక్కల, అలారుదిన్నె, మాచాపురం, ఆలూరు, విరుపాపురం తదితర గ్రామాల్లో పర్యటించి.. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై డ్రిప్ పరికరాలు పొందిన రైతులు సాగుచేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రిప్ విధానం ద్వారా రైతులు తక్కువ నీటితో లాభసాటిగా పంటల సాగు చేపట్టవచ్చన్నారు. తీగ పంటలు, ఆకుకూరలు, కూరగాయాల సాగు ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని వివరించారు. ఆలూరు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో 1500 మంది రైతులకు చెందిన 5 వేల ఎకరాల భూమి సాగయ్యేలా రూ.3 కోట్లతో డ్రిప్ పరికరాలను మంజూరు చేశామన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పురుగులు, తెగుళ్ల నివారణపై వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు.

## రైతుల డిమాండ్లను కేంద్రం నెరవేర్చాలి

హొళగుంద: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని అఖిలపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. సోమవారం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎస్ఎఫ్, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో హొళగుందలో బైక్ ర్యాలీ, ధర్నా కార్యక్రమం జరిగింది. ఆయా పార్టీల నాయకులు తిమ్మయ్య, పెద్యాట మారెప్ప, వెంకటేశ్వర్లు, హమాన్, పెద్యాట శ్రీరంగ, రంగన్న తదితరులు మాట్లాడుతూ.. రైతులు పండించిన దిగుబడులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడాదైనా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. డిమాండ్ల సాధన కోసం హర్యానా, పంజాబ్ రాష్ట్రాల రైతులు ఢిల్లీలో ఆందోళన చేపట్టేందుకు వస్తుంటే పోలీసు బలగాలను మోహరించి ఇబ్బందులు పెడుతున్నారని, ఐదుగురు రైతులను బలిగొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చెసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**రైతు వ్యతిరేకి మోదీ**

దేవనకొండ: రైతు కార్మిక వ్యతిరేకి ప్రధాని నరేంద్రమోదీ వైఖరి నశించాలని ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీరాములు, సీపీఐ మండలకార్యదర్శి నరసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దేవనకొండలో వామపక్షాలు, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదోని పట్టణం అరుణ్ జ్యోతి నగర్‌కు చెందిన ఫిలిప్ కబడ్డీ టీం ప్లేయర్ అరుణ్‌కుమార్ ఎంపికైనట్లు క్రీడాకారుల అసోసియేషన్ సెక్రటరీ ఆర్.సుభకర్ సోమవారం తెలిపారు. ఈ నెల 25న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఇందులో అరుణ్‌కుమార్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

### 29న దివ్యాంగుల సింహగర్జన

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 29న కర్నూలు ఎస్టీబీసీ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన దివ్యాంగుల సింహగర్జన కార్యక్రమానికి జిల్లాలోని దివ్యాంగులందరూ తరలిరావాలని ఆ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం వెల్దుర్తి మార్గదర్శి దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఆయనతోపాటు మండల సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామగిడ్డయ్య, శ్రీరాములు మాట్లాడుతూ.. ఆదర్శ జిల్లా వికలాంగుల సమాఖ్య, జేఏసీ ఆధ్వర్యంలో సింహగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో దివ్యాంగుల సంక్షేమం, దివ్యాంగ చట్టాల అమలు, రాయితీలు, రిజర్వేషన్లు చేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక మండల సమాఖ్య ప్రతినిధులు రాజు, హనుమన్న, గోవిందు, సుధాకర్, శేషు, రామాంజి, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

### కొర్ర సాగు.. ఆదాయం బాగు


మండలంలో సాగైన కొర్ర పంట

దేవనకొండ: మానవ జీవన సరళిలో చిరుధాన్యాల ప్రాధాన్యత పెరుగుతోంది. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉండడంతో ఈ యేడాది రబీలో మండలంలో వివిధ గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల దాకా కొర్ర పంటను రైతులు సాగుచేశారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం వచ్చే పంటగా ఉండడంతో రైతులు కొర్ర సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. కొర్రకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.2500 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో అంతకుపైగానే ధర ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా రబీ సీజన్‌లో నీటి వసతి ఉన్నచోట ఒకటి రెండు తడులు నీరు అందిస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఖర్చులు పోనూ ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల దాకా మిగులుతుంది.

## గర్భిణులకు అవగాహన కల్పించండి

ఆలూరు రూరల్: గర్భిణులకు సుఖ ప్రసవాలపై అవగాహన కల్పించాలని మొలగవల్లి డాక్టర్ రేష్మా సూచించారు. ఆమె సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భిణులను ప్రతి నెలా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. రక్తహీనత లోపం ఉన్న వారికి ఐరన్ ట్యాబ్లెట్లు అందించాలన్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన చికిత్స అందేలా చూడాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఆంద్రూస్, కళావతి ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

### తాగునీటి ఎద్దడి రానీయొద్దు

హొళగుంద: వేసవిలో మండలంలోని అన్ని గ్రామలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మల్లికార్జునయ్య ఏఈ రామ్‌లీల, సిబ్బందిని ఆదేశించారు. ఇటీవలే ఎల్లెల్సీకి నీటిని విడుదల చేయడంతో మండలంలోని మంచినీటి పథకాల పరిస్థితిని తెలుసుకునేందుకు సోమవారం ఆయన ఏఈ రామ్‌లీల, క్వాలిటీ కంట్రోల్ ఏఈ శివకుమార్‌తో కలిసి హొళగుంద సమీపంలోని కట్లమాగి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, ఇతర గ్రామాల మంచినీటి పథకాలను పరిశీలించారు. ఇటీవలే దెబ్బతిన్న కట్లమాగి ట్యాంకు గట్టును పరిశీలించిన ఆయన ట్యాంకుకు సమస్య తలెత్తకుండా ఎల్లెల్సీ నీటిని నింపాలని నీటిమట్టం తగ్గిన తర్వాత దెబ్బతిన్న గట్టుకు శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. ఆయా పథకాలలో నీటి నిల్వ, ఇతర విషయాలను తెలుసుకుని అన్ని గ్రామాలకు నీటి సమస్య తలెత్తకుండా శుద్ధజలాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు.

## పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆలూరు సీనియర్ నాయకులు మొలగవల్లి రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం హాలహర్విలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయని, ఆలూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలన్నారు. సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కో–కన్వీనర్ మల్లికార్జున, నాయకులు గంగాధర్, తిమ్మప్ప, గోపాల్, ఓబుళపతి, సుంకన్న, మస్తాన్, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.